

మహిళా డిగ్రీ కళాశాలలో వైద్య శిబిరం



నిర్మల్ కల్చరల్, ఆగస్టు 21 : శాంతినగర్‌లో మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాంనగర్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత గల వారికి మాత్రలు అందజేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డాక్టర్ శ్వేత, పీహెచ్‌ఎం రమణ, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్; ఆశా కార్యకర్తలు, ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ పరిశ్రమకు పచ్చజెండా





సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామ సూచిక బోర్డు

- ఎన్‌ఓసీ జారీ చేసిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు
- ఇరిగేషన్ అనుమతులకు గ్రీన్ సిగ్నల్
- రాబోయే నెలాఖరులోగా పనులు ప్రారంభం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల రాక

నిర్మల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సోన్ మండలం పాక్‌పట్ల వద్ద నిర్మించ తలపెట్టిన ఆయిల్ పామ్ ప్యాక్టరీకి రాష్ట్ర పొల్యూషన్ బోర్డు నుంచి క్లియరెన్స్ లభించింది. గత కొంతకాలం నుంచి పొల్యూషన్ బోర్డు క్లియరెన్స్ లభించకపోవడంతో ఈ పరిశ్రమ నిర్మాణ పనులు మొదలుకాలేదు. దీంతో పాటు గోదావరి పరివాహకానికి సమీపంలో ఈ పరిశ్రమను నిర్మిస్తున్న కారణంగా ఇరిగేషన్ శాఖ కూడా ఎన్‌ఓసీని జారీ చేయలేకపోయింది. బఫర్‌జోన్ పరిధిలో లేనప్పటికీ నదికి సమీపంలో ఉన్న కారణంగా ఇరిగేషన్‌శాఖ ఈ పరిశ్రమ ఏర్పాటుకు మొదలు అనుమతి ఇవ్వలేదు. సంబంధిత ఫ్యాక్టరీ యాజమాన్యం సాంకేతిక అంశాలను ఆధారాలతో సహా చూపించడంతో ఇరిగేషన్‌శాఖ సైతం పరిశ్రమ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే అన్ని రకాల అనుమతులు జారీ కావడంతో ఇక సెప్టెంబర్ నెలాఖరులోగా ఈ పరిశ్రమ నిర్మాణ పనులను మొదలుపెట్టేందుకు యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోంది. పనులను ప్రారంభించేందు కోసం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కూడా ఇక్కడికి రప్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా మొత్తం 400 కోట్లతో నిర్మించనున్న ఈ పరిశ్రమ కోసం ఇప్పటికే పాక్‌పట్ల వద్ద 40 ఎకరాల స్థలాన్ని కూడా సేకరించారు. 2023 సంవత్సరంలో అప్పటి మంత్రి కేటీఆర్ పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మలేషియాకు చెందిన ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ పరిశ్రమను నిర్మిస్తున్నారు. గత రెండు నెలల నుంచి పరిశ్రమను పరిగణలోకి తీసుకొని జిల్లా వ్యాప్తంగా ఆయిల్ పామ్ పంట సాగును మొదలుపెట్టారు. మొత్తం నాలుగు సంవత్సరాలకు గానూ పది వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేయాలని నిర్ధారించారు. దీనికి అనుగుణంగా ఇప్పటికే దాదాపు 7వేల ఎకరాల్లో పంటసాగు కొనసాగుతోంది. రాబోయే సంవత్సరం మార్చి నెల వరకు మొత్తం పదివేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేయబోతున్నారు. కాగా మరింతగా ఆ పంటసాగును విస్తరించేందుకు అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. ఓ వైపు ఆయిల్ పామ్ పంటను సాగుచేస్తుండగానే అంతరపంటగా కోకోపంటను కూడా సాగుచేసే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదిలా ఉండగా పంటను సాగు చేసే రైతులందరికీ సబ్సిడీపై ఆయిల్ పాం మొక్కలను అందించేందు కోసం సారంగాపూర్ మండలం బీరవెల్లి గ్రామం వద్ద ప్రత్యేక నర్సరీని కూడా ఏర్పాటు చేశారు. ఈ నర్సరీ ద్వారానే జిల్లా అంతటికి మొక్కల పంపిణీ కొనసాగుతోంది.



అనుమతుల ఆటంకాలు అధిగమించి

పంటను అధికంగా సాగుచేసే ప్రాం తమైన సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామాన్ని ఆయిల్‌పామ్ పరిశ్రమ నిర్మాణం కోసం అధికారులు ఎంపిక చేశారు. అయితే 40 ఎకరాల స్థలాన్ని సేకరించి పరిశ్రమ ఏర్పాటుకు మలేషియాకు చెందిన ప్రీ యూనిక్ సంస్థ ఏర్పాట్లు చేపట్టింది. అయితే పరిశ్ర మ గోదావరినదికి సమీపంలో ఉండడం అలాగే చుట్టు పక్కల పంట పొలాలు ఉండడంతో ఇటు పొల్యూషన్ బోర్డు అటు ఇరిగేషన్‌శాఖ అనుమతులకు అంగీకరించలేదు. దీంతో దాదాపు రెండేళ్ల నుంచి ఈ పరిశ్రమ యాజమాన్యం అనుమతుల కోసం అన్నిరకాల ప్రయత్నాలు ముమ్మరంగా చేపట్టింది. ఇతర అనుమతులు లభించినప్పటికీ పొల్యూషన్ బోర్డు ఇరిగేషన్‌శాఖలు ఇప్పటి వరకు అనుమతులు ఇచ్చేందుకు వెనకడుగు వేశాయి. దీంతో పరిశ్రమ నిర్మాణ పనుల్లో తీవ్రజాప్యం చోటు చేసుకుంది. అయితే ఓ దశలో పరిశ్రమను పొరుగున ఉన్న నిజామాబాద్ జిల్లాకు తరలించుకుపోయే అవకాశాలున్నట్లు కూడా ప్రచారం జరిగింది. దీంతో స్థానిక ప్రజా ప్రతినిధులు అనుమతుల కోసం సంబంధిత అధికారులపై ఒత్తిడులు తీసుకువచ్చారు. పరిశ్రమలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర పొల్యూషన్ బోర్డు అధికారులతో చర్చించి కాలుష్య నివారణకు అవసరమైన సాంకేతికతను ఉపయోగించేందుకు యజామాన్యాన్ని అంగీకరింపజేశారు. మరోసారి నివేదికను పరిశీలించిన రాష్ట్ర పొల్యూషన్ బోర్డు ఎట్టకేలకు పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాటు బఫర్‌జోన్‌కు సమీపంలోనూ పరివాహకానికి అనుకొని నిర్మిస్తున్న ఈ పరిశ్రమ కోసం ఇప్పటి వరకు ఇరిగేషన్‌శాఖ కూడా ఎన్‌ఓసీ జారీ చేయలేదు. ఇటు కంపెనీ యాజమాన్యం సాంకేతికత కారణంగా గోదావరి నదికి ఎలాంటి నష్టం జరగకుండా చూసేందు కోసం చేపట్టబోయే చర్యలను సర్కారుకు వివరించింది. అలాగే బఫర్ జోన్‌కు పరిశ్రమ చాలా దూరంగా ఉందన్న విషయాన్ని కూడా యాజమాన్యం ఉన్నతాధికారులకు వివరించింది. దీంతో సాధ్యాసాధ్యాలను పరిశీలించిన ఇరిగేషన్ శాఖ ఎట్టకేలకు ఎన్‌ఓసీని జారీ చేయడంతో ఇక పరిశ్రమ నిర్మాణానికి ఎదురైన ఆటంకాలన్ని తొలగిపోయినట్లేనంటున్నారు.

ప్రత్యక్షంగా పరోక్షంగా భారీ ప్రయోజనాలు

ఆయిల్ పాం పరిశ్రమ ఏర్పాటుతో రైతులకు అధిక ప్రయోజనం చేకూరనుండగా స్థానికులకు కూడా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అంటున్నారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా అందరికీ లబ్ది చే కూ రు తుం దని చెబుతున్నారు. ఇప్పటి వరకు సంప్రదాయ పంటలను సాగు చేస్తూ తక్కువ దిగుబడులతోనూ ఆశించిన మేరకు ధరలు లభించకపోవడంతోనూ నష్టాలపాలవుతున్న రైతులకు ఆయిల్‌పామ్ సాగు వరంగా మారనుందంటున్నారు. ఇప్పటికే దాదాపు 7వేలకు పైగా ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తుండగా అంతరపంటగా మరిన్ని ఇతర పంటలను కూడా రైతులు సాగు చేసుకుంటున్నారు. రాబోయే మార్చి నెల వరకు మొత్తం పదివేల ఎకరాల్లో పంటను సాగు చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ఇతర పంటల మాదిరిగా ఆయిల్‌పామ్ పంట ధరను కేంద్ర ప్రభుత్వం నిర్ధారించనున్నాయి. కేంద్ర వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ధారణ కమిటీ ఆయిల్ పాం పంటకు ధరను నిర్ణయించనుంది. శాస్త్రీయంగా పెట్టుబడులు, శ్రమ, మార్కెట్ డిమాండ్‌ను పరిగణలోకి తీసుకొని ఈ సంస్థ పంట ధరలను నిర్ణయించనుందంటున్నారు. ఇటు రైతులకు పంట దిగుబడుల కారణంగా లాభాలు రానుండగా స్థానికులకు పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి లభించనుంది. ముఖ్యంగా ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుతో 200 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని అంటున్నారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడనున్నట్లు చెబుతున్నారు.

పరిశ్రమ నిర్మాణ పనులకు చర్యలు

ఆయిల్ పామ్ పరిశ్రమ ఏర్పాటు నిర్మాణానికి రాష్ట్ర పొల్యూషన్ బోర్డు, ఇరిగేషన్ శాఖలు క్లియరెన్స్‌లు జారీ చేశాయి. అన్ని రకాల క్లియరెన్స్‌లు రావడంతో పరిశ్రమ నిర్మాణ పనులను సెప్టెంబర్ చివరిలోగా చేపట్టనున్నాం. నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కంపెనీ యాజమాన్యం ఆహ్వానించనుంది. నిర్మల్ జిల్లాలో పదివేల ఎకరాల్లో ఆయిల్ ఫాం పంట సాగు లక్ష్యాన్ని నిర్ధారించాం. ఆయిల్ పామ్ పంట ద్వారా స్థానిక రైతులకు అధిక ప్రయోజనాలు లభించనున్నాయి. ఇప్పటి వరకు ఎదురైన అవరోధాలన్ని తొలగిపోవడంతో దశల వారిగా సాగును మరింత విస్తరిస్తాం.

- నాగ మల్లేశ్వర్ రావు, జనరల్ మేనేజర్ , ఆయిల్ ఫాం ఫ్యాక్టరీ

ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రతీ నెల అవార్డులు

- ట్రాన్స్‌కో ఎస్ఈ బి. శ్రీనివాస్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 11 : ఎన్‌పీడీసీఎల్ పరిధిలో పని చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన పారామీటర్లలో ఉద్యోగులకు ప్రతి నెల జ్ఞాపికలు, అవార్డులు అందజేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎస్ఈ బి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులు అధికారులు సిబ్బందిలో మెరుగైన, నాణ్యమైన సేవలు వినియోగదారులకు అందించే వీలుంటుందన్నారు. సంస్థ సీఎండీ కే. వరుణ్ రెడ్డి ఈ అవార్డులను ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ వసూళ్ళు, వినియోగదారులకు సత్వర సేవలు, కొత్త సర్వీసు కనెక్షన్లు అమర్చడం, డీటీఆర్ నిర్వహణ తదితర పారామీటర్ల ఆధారంగా అవార్డులు అందిస్తున్నట్టు తెలిపారు. ఎస్ఈలు, డీఈలు, ఏడీఈ, ఏఈలు ఈ అవార్డులు స్ఫూర్తినిస్తాయని, పోటీతత్వం పెంచుతుందని పేర్కొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం
నిలిపి వేయాలని అర్ధనగ్న నిరసన


అర్ధ నగ్నంగా నిరసన తెలుపుతున్న దిలావర్‌పూర్ గ్రామస్థులు

దిలావర్‌పూర్, ఆగస్టు 21 : దిలావర్‌పూర్ - గుండంపల్లి గ్రామాల మధ్య ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ పనులు వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ దిలావర్‌పూర్ గ్రామస్తులు అర్ధ నగ్నంగా నిరసన తెలిపారు. కాగా ఇథనాల్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 30 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎంత దానికైనా తెగిస్తామని, ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం ఎట్టి పరిస్థితుల్లోను అడ్డుకుని తీరుతామన్నారు. మా ప్రాణాలు ఇవ్వడానికైనా మేం సిద్ధంగా ఉన్నామన్నారు. భవిష్యత్ తరాల కోసమే మా కొట్లాట అని, అందుకు మా ప్రాణాలు ఉంటే ఏంటి పోతే ఏంటని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం నిలిపి వేయాలని కోరారు.

స్వయం సహాయక సంఘాల
మహిళలకు సబ్బుల తయారీపై శిక్షణ

దిలావర్‌పూర్, ఆగస్టు 21 : మండలంలోని ఐకేపీ స్వయం సహాయక సంఘాల మహిళలకు చైతన్య మండల సమాఖ్య ఆధ్వర్యంలో దిలావర్‌పూర్ స్త్రీ శక్తి భవన్‌లో సబ్బులు, సర్ఫ్ తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఐకేపీ ఏపీఎం సులోచన రెడ్డి తెలిపారు. ఈడీఎల్ ఎల్ సంస్థ వారు 26 రోజులపాటు మహిళలకు శిక్షణ ఇస్తారని చెప్పారు. ఆసక్తి గల స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు శిక్షణకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

భైంసా ఏరియా ఆసుపత్రిలో బాలింత, పసికందు మృతి

- ఆందోళనకు దిగిన బాధిత కుటుంబీకులు
- ఘటనపై కలెక్టర్ అభిలాష అభినవ్ ఆరా
- ఆసుపత్రిలో పోలీసు బందోబస్తు


భైంసా ఆసుపత్రిలో బాలింత శీతల్ రాథోడ్ మృతదేహం

భైంసా, ఆగస్టు 21 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో బుధవారం రాత్రి బాలింత, పసికందు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం కుభీర్ మండలం బ్రహ్మేశ్వర్ గ్రామానికి చెందిన రాథోడ్ శీతల్ (25) మంగళవారం ప్రసవం నిమిత్తం ఇక్కడి ఏరియా ఆసుపత్రిలో చేరింది. అయితే బుధవారం సాయంత్రం వరకు సాధారణ ప్రసవం కోసం వైద్యసిబ్బంది ప్రయత్నించారు. అప్పటికే రాథోడ్ శీతల్ పురుటి నొప్పులతో తీవ్ర అస్వస్థత చెందింది. పరిస్థితి ప్రమాదకరంగా మారడాన్ని గుర్తించిన వైద్యులు, సిబ్బంది సాయంత్రం ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించారు. అప్పటికే కడుపులోనున్న మగశిశువు మృతి చెందాడు, శస్త్రచికిత్స నిర్వహించిన అనంతరం బాలింతను ప్రసవవార్డుకు తరలించారు. ఇలా తరలించిన కాసేపటికి శీతల్ ఆరోగ్యపరిస్థితి విషమించింది. వైద్య అధికారులు, సిబ్బంది ఆమెను కాపాడేందుకు యత్నించినప్పటికీ ఫలితం కానరాలేదు. రాత్రి 8.45 ప్రాంతంలో బాలింతరాలు మృతి చెందినట్లుగా భైంసా ఏరియా ఆసుపత్రి వైద్యులు ప్రకటించారు.

● వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకుల ఆందోళన

ఏరియా ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బంది అనుసరించిన నిర్లక్ష్యపు ధోరణి వల్లే శీతల్ రాథోడ్ మృతి చెందిందని బాధిత కుటుంబీకులు ఆరోపించారు. సకాలంలో స్పందించి వైద్య సేవలు అందించే విషయంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని విమర్శించారు. దినం వేళలో ఎన్నిమార్లు వెళ్లి వేడుకున్న వైద్య సిబ్బంది పట్టించుకోలేదని పేర్కొన్నారు. బాలింతరాలి మృతికి వైద్యులు, సిబ్బంది కారణమంటూ ఆందోళనకు దిగారు. కోపోద్రిక్తులైన బాధిత కుటుంబీకులు వైద్యులను నిలదీసి వాగ్వాదానికి దిగారు. వైద్యుల సమాధానం పట్ల సంతృప్తి చెందిన బాధిత కుటుంబీకులు ఆగ్రహావేశాలతో వైద్యులు, సిబ్బందిపై దాడికి విఫలయత్నం చేశారు.

● కలెక్టర్ ఆరా

పసికందు, బాలింతరాలి మృతి ఘటనలపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆరా తీసినట్లుగా తెలిసింది. రాత్రి 9 గంటల ప్రాంతంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కాశీనాథ్‌లో జిల్లా కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నట్లుగా సమాచారం .

● పోలీసు బందోబస్తు

మృతురాలి కుటుంబీకులు ఆందోళనకు దిగడంలో ఆసుపత్రిలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భైంసా టౌన్ సీఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. కోపోద్రిక్తులైన బాధిత కుటుంబీకులు వైద్యులను నిలదీసి దాడికి యత్నించడం లాంటి ఘటనలు చోటు చేసుకోవడంతో పోలీసులు అప్రమత్తతతో వ్యవహరించారు. టౌన్ సీఐ రాజారెడ్డి బాధిత కుటుంబీకులతో మాట్లాడి ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆందోళనకు దిగిన బాధిత కుటుంబీకులను సముదాయించే ప్రయత్నం చేశారు.

భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులను పకడ్బందీగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్


హాజరైన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, ఆగస్టు 21 : భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించిన అంశాలపై రెవెన్యూ, పంచాయతీ, నీటి పారుదల శాఖ అధికారులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... క్రమబద్ధీకరణ దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలించాలని సూచించారు. ప్రతి అధికారి ఎల్‌ఆర్‌ఎస్‌పై విస్తృత అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇప్పటికే ముగ్గురు సభ్యులతో కూడిన బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దరఖాస్తుల పరిశీలన సందర్భంగా వివిధ దశలలోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, దరఖాస్తులను తిరస్కరించినట్లయితే కారణాలను రిమార్కుల విభాగంలో పొందుపరిచి, దరఖాస్తుదారుడికి తెలియజేయాలన్నారు. ప్రభుత్వ భూములు, దేవాదాయ, శిఖం, చెరువులు, కుంటలకు సంబంధించిన భూములను క్రమబద్ధీకరించరాదని హెచ్చరించారు. మున్సిపాలిటీలు, మండలాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ట్రైనర్లు ఎల్‌ఆర్‌ఎస్‌లోని అంశాలు, సంబంధిత మొబైల్ యాప్‌లోని విషయాలు, దరఖాస్తుల పరిశీలన సమయంలో పాటించవలసిన నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం అధికారులకు ఎల్‌ఆర్‌ఎస్ అంశాలపై ఉన్న సందేహాలను ట్రైనర్లు నివృత్తి చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌వో భుజంగ్ రావు, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, సర్వేయర్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ సుదర్శన్, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ, నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

ఖానాపూర్, ఆగస్టు 21 : పట్టణంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా స్థానిక ఎమ్మెల్యే బొజ్జు సహకారంతో చర్యలు చేపడతామని మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. బుధవారం పట్టణంలోని ఐదవ వార్డు పరిధిలో మున్సిపాలిటీ నిధుల ద్వారా మంజూరైన బోరు ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పరిమి సురేష్, తూము చరణ్, మేష సతీష్, వాసే ఖాన్, కిషన్, గణేష్, రాజేందర్, తదితరులున్నారు.


ఐదవ వార్డులో బోరు ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

సంక్షిప్త సమాచారం

నాన్ టీచింగ్ పోస్టుల దరఖాస్తుకు
ఈ నెల 31 గడువు : డీఈవో

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 21 : కేజీబీవీ పాఠశాలల్లోని నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేయాలని డీఈవో రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 32 పోస్టులు ఉన్నాయన్నారు. వంట మనిషి, సహాయ వంట మనిషి, స్వీపర్, స్కావెంజర్, ఆఫీస్ సబార్డినేట్స్, అటెండర్, వాచ్‌మెన్ పోస్టులున్నాయని తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన వారు తమ మండలంలోనే దరఖాస్తు చేయాలని సూచించారు. వివరాలకు ఎంఈవోలను సంప్రదించాలన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు 24న మేళా

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 21 : హెచ్‌సీఎల్ టెక్ ఆధ్వర్యంలో ఈ నెల 24న సాఫ్ట్‌వేర్ రంగంలో డీపీవో పోస్టుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరుశరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. సీఈసీ, ఒకేషనల్, హెచ్ఈసీ 2024లో పూర్తి చేసుకున్నవారు నిర్మల్‌లోని సిద్ధార్థ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో హాజరు కావాలని సూచించారు. సంబంధిత అర్హత, ఆధార్, ఫోటోతో రావాలన్నారు. వివరాలకు 8074065803 నెంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి
రూ. 10 లక్షల చెక్కు అందజేత

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 21 : ఇటీవల ప్రమాదవశాత్తు భైంసా మిషన్ భగీరథ వాటర్‌ట్యాంక్‌లో పడి మృతి చెందిన నాగన్న కుటుంబానికి 10 లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కును మహాగాం మేనేజర్ అభిలాష్ బుధవారం అందజేశారు. మృతుడు 500 రూపాయలతో బ్యాంక్‌లో బీమా పాలసీ తీసుకున్నాడని తెలిపారు. మృతుడి భార్య లలిత, గంగాప్రసాద్, దత్తు రాథోడ్, ఖాతాదారులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ఎస్‌బీఐ ప్రమాద బీమా తీసుకోవాలని మేనేజర్ కోరారు.


హామీల అమలు కోసం నేడు ధర్నా


నిర్మల్ కల్చరల్, ఆగస్టు 21 : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని గురువారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కే. రాజన్న పిలుపునిచ్చారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అయిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని ఆరోపించారు. రైతు రుణమాఫీ అందరికీ వర్తింపజేయకపోవడంతో రోడ్లు ఎక్కారన్నారు. పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలపై ఆందోళన చేపట్టామని కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. జిల్లా కార్యదర్శి నంది రామయ్య, ఎం. బక్కన్న, ఎండీ గఫూర్, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల ఎస్సైగా భాస్కరచారి



కుంటాల, ఆగస్టు, 21: కుంటాల ఎస్సైగా భాస్కర చారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన రజనీ కాంత్ ముప్కాల్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో భాస్కర చారి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.





మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 21 : మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కుంటాల రాములు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సంఘం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ జీతాలు, పెండింగ్‌లో ఉన్న కోడి గుడ్ల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

'భావిభారత పౌరులను తయారు చేయాలి'

ఉట్నూర్, ఆగస్టు 21 : ఉపాధ్యాయులు భావి భారత పౌరులను తీర్చి దిద్దడానికి నిరంతరం కృషి చేయాలని పూలాజీబాబా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అన్నెడ మల్లారెడ్డి అన్నారు. బుధవారం పూలాజీబాబా డీఎడ్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించగా ఆయన మాట్లాడారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్న ఛాత్రోపాధ్యాయులు విద్యార్థులు సమాజానికి ఉన్నతమైన సేవ చేసి భావి భారత విద్యార్థులని తయారు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డీఎడ్ కళాశాల ప్రిన్సిపల్ శివారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శేషు, పూలాజి బాబాస్కూల్స్ ప్రిన్సిపల్ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహారాష్ట్ర రైతులు మృతి

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 21 : పత్తి పంట దిగుబడి రాదేమోనన్న బెంగతో, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్యకు యత్నించిన మహారాష్ట్రకు చెందిన ఇద్దరు రైతులు చికిత్స పొందుతూ మృతి చెందారు. టూ టౌన్ ఏఎస్సై ముకుంద్ రావ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర కిన్వాట్ పట్నోడా గ్రామానికి చెందిన సోయం దత్త(26) ఈనెల 20వ తేదీన గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. మహారాష్ట్ర పాండ్రక్వాడ, కేలాపూర్ కారేగావ్‌కు చెందిన చింతల్వార్ అశ్విత్(32) ఈనెల 19న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు, స్థానికులు మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరతలించారు. చికిత్స పొందూత బుధవారం మృతిచెందినట్లు ఏఎస్సై తెలిపారు. కాగా జీరో ఎఫ్ఐఆర్ చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 21 : చికిత్సపొందుతూ మహోర్ తాలూకా గోండ్వావర్సకు చెందిన బావువ్ వైష్ణవి (25) చికిత్సపొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 7వ తేదీన ఇంట్లో కట్టెల పొయ్యిలో పెట్రోల్ పోసి వెలిగించే క్రమంలో ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకుంది. గాయాలపాలైన ఆమెను జిల్లాకేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఏఎస్సై ముకుంద్‌రావ్ తెలిపారు. తండ్రి ఇప్ప రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.

చీటీల పేరుతో మోసం : ఇద్దరి అరెస్టు

బోథ్, ఆగస్టు 21 : బోథ్ మండల కేంద్రానికి చెందిన సిరిపురం రవికుమార్, ఉడుత గంగాధర్ అనే ఇరువురు వ్యక్తులు చీటీల పేరుతో రెండు కోట్లకుపైగా వసూలు చేసి మోసం చేసినందుకు గాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు ఎస్సై ఎల్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కొన్ని రోజులుగా తప్పించుకుని తిరుగుతుండగా పట్టుకుని అరెస్టు చేశామన్నారు. ఈ సందర్భంగా సీఐ రమేష్, ఎస్సై ఎల్.ప్రవీణ్‌కుమార్‌లు మాట్లాడుతూ మోసగాళ్ళ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

గుట్కా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

బోథ్, ఆగస్టు 21 : మండలంలో చంబర్ సుభాష్ అనే వ్యక్తి గుట్కా తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో దాడి చేయడం జరిగిందని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గుట్కా విలువ 28,264 ఉంటుందని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయాలి

● వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే


ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 21 : వయోవృద్ధులకు ప్రభుత్వం కల్పించే పథకాలను సక్రమంగా అమలు చేయాలని వయోవృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. బుధవారం జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వయోధిక వృద్ధులను సత్కరించారు. సీనియర్ సిటిజన్‌లకు ప్రభుత్వం బస్సు, రైతు ప్రయాణంలో రాయితి కల్పించాలని, వయోవృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. వృద్ధులపై శ్రద్ధ చూపి వైద్యసదుపాయాలను మరింత మెరుగు పర్చాలన్నారు. వృద్ధాప్యంలో పిల్లల తల్లిదండ్రులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రాంకులకర్ణి, ఉపాధ్యక్షుడు శీలకిషన్, కోశాధికారి శేషగిరిరావు, అఫ్సకాన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

బోథ్, ఆగస్టు 21 : బోథ్ మండల కేంద్రానికి చెందిన ఎంపీడీవో సుశీల్ రెడ్డి తండ్రి ఇటీవల మృతిచెందడంతో బుధవారం పరామర్శించారు. అంతేగాక అల్లా కొండ పోతన్న తండ్రి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. రామ్‌రెడ్డి, గుండయ్య, సతీష్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.
















జిల్లా ఎస్పీని కలిసిన కైలాస్‌నగర్ వాసులు



వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఆదిలాబాద్ అర్బన్, ఆగసు 21 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కైలాస్ నగర్ ఎన్జీఓ సొసైటీ ప్లాట్లను కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను కోరారు. ఈ విషయమై బుధవారం జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కైలాస్‌నగర్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు లోక ప్రవీణ్‌రెడ్డి, దుర్గంశేఖర్, వై.రాంకుమార్, రాంకిషన్, కొండల్‌రావు, గంగా రెడ్డి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం

● జిల్లా ప్రధాన కార్యదర్శి కుడాల రవీందర్



సభ్యత్వ నమోదును చేపడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్

తలమడుగు , ఆగస్టు 21 : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుడాల రవీందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘం ద్వారా ఎన్నో పోరాటాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేందర్ యాదవ్, రవీందర్, జిల్లా బాధ్యులు వినోద్‌రెడ్డి, స్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులకు నాణ్యమైన మందులు వాడాలి

తలమడుగు , ఆగస్టు 21 : వ్యవసాయ పంటలు సాగు చేసి రైతుల సోదరుల అధిక దిగుబడుల కోసం నాణ్యమైన కంపెనీ మందులు వాడాలని విల్ ఫుడ్ ప్రొడక్ట్ కంపెనీ ప్రతినిధి అనిరుగ్‌సింగ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు మర్రివిలాస్ పంట పొలంలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు కాలం కష్టంచేసి రైతులు అధిక దిగుబడి కోసం అధికారులు సూచించిన నాణ్యమైన కంపెనీ మందులు వాడాలని సూచించారు. విల్‌ఫుడ్ కంపెనీ వాడిన మందులతో పత్తిపంటలు చాలా బాగున్నాయని ఆయన సూచించారు. అనంతరం రైతులు అడిగిన పలు సందేహాలకు ఆయన సమాధానం ఇచ్చారు. కార్యకమంలో రైతులు, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధులు, రైతులు

బంద్ విజయవంతం



ఇచ్చోడలో రాస్తారోకో నిర్వహిస్తున్న మాలసంఘం, బీఎస్పీ నాయకులు



ఉట్నూర్‌లో మూసి ఉంచిన వాణిజ్య, విద్యా సంస్థలు



ఉట్నూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఉట్నూర్, ఆగస్టు 21 : మాల మహానాడు జాతీయ నాయకులు ఇచ్చిన భారత్‌బంద్ పిలుపు మేరకు బుధవారం ఉట్నూర్ ఏజెన్సీ లో సంపూర్ణంగా ప్రశాంతంగా జరిగింది. ఉట్నూర్ పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు మాల మహానాడు నాయకులు ర్యాలీగా వెళ్లి ఆర్డీవో కార్యాలయం పరిపాలన అధికారికి మెమోరాండం సమర్పించారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం మీదుగా వినాయక్‌చౌక్, జగ్జీవన్‌చౌక్, అంబేద్కర్‌చౌక్‌ల మీదుగా కొమురంభీం ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి దాసండ్ల ప్రభాకర్ మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ కోసం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునురద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఇంద్రవెల్లి : సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ దేశవ్యాప్తంగా దళితులు ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం భారత్ బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచి వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి మద్దతు తెలిపారు. అదేవిధంగా విద్యాసంస్థలన్నీ బందు సందర్భంగా మూతపడ్డాయి. ముందస్తు స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్ ఆధ్వర్యంలో పోలీసులు ముఖ్యమైన కూడళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

తలమడుగు : ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్‌బంద్ కార్యక్రమంలో తలమడుగు మండలంలో విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ ఐక్యంగా ఉన్న ఎస్సీలను విడగొట్టేందుకే వర్గీకరణ బిల్లును చేపట్టార న్నారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు క్రాంతికుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులు దేవన్న, ఆనంద్, శశాంత్, గంగన్న, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ : ఎస్సీ వర్గీకరణ పార్లమెంట్‌లో చట్టం చేయాలి తప్ప రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా చేస్తాయని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రత్నపురం రమేష్, బోథ్ ఇంచార్జీ మెస్రం జంగుబాపు అన్నారు. భారత్ బంద్‌లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన నిరసన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించి రస్తారోకో చేశారు. స్వతంత్రం వచ్చి ఇప్పటికీ కలిసి ఉంటున్న ఎస్సీ, ఎస్టీలను విడగొట్టడం రాజ్యాంగంలో ఎక్కడ కూడా పొందుపరచలేదన్నారు. తక్షణమే తీర్పును వెనక్కి తీసుకోవాలని సుప్రీంకోర్టుకు సవాలు చేశారు.

జైనథ్ : దేశంలో ఎస్సీవర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ బుధవారం మండలంలోని ఆయా గ్రామాలతో పాటుమండల కేంద్రమైన జైనథ్‌లో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జైనథ్ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా జైనథ్‌లో గల కిరాణాషాపులు, హోటళ్లు, పాన్‌డబ్బాలు ఇతర షాపులను మూసి వేశారు. ఈ సందర్భంగా మాల సంక్షేమ సంఘం జైనథ్ మండల అధ్యక్షులు దేవళ్ల సంజీవ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ భారత్‌బంద్‌ను నిర్వహించడం జరిగిందన్నారు.

తాంసి: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం తాంసి మండల కేంద్రంలో తలపెట్టిన భారత్ బంద్ విజయవంతం అయింది. ఉదయం నుంచి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మాల కులస్తులు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. దుకాణాలను, ప్రైవేటు విద్యాంస్థలు, ప్రభుత్వ విద్యాసంస్థలను మూసివేయించారు.

నార్నూర్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నార్నూర్ మండల కేంద్రంలో భారత్‌బంద్ కార్యక్రమం నిర్వహిస్తూ స్థానిక గాంధీచౌక్ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ లోకండే నరహరి కాంబ్లె మాట్లాడుతూ సుప్రీంకోర్టు న్యాయస్థానం పునఃసమీక్షించి ఆలోచించి ఈ విషయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ వల్ల దళితుల్లో ఐక్యత దెబ్బతినే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. వర్గీకరణ పై దళిత ఎంపీలు, ఎమ్మెల్యేలు స్పందించాలని, వర్గీకరణ విషయంలో పునరాలోచన చేయాలని కోరారు. ఎ

ఆదిలాబాద్‌అర్బన్ : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం చేపట్టిన భారత్‌బంద్ జిల్లాలో పాక్షికం అయింది. ఉదయం నుంచి దుకాణాలు తెరుచుకోలేదు. ముందుగానే వ్యాపార, వాణిజ్యసంస్థలు, విద్యా సంస్థలు సెలవులు ప్రకటించాయి. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నాయకులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.



బంద్‌కు మద్దతుగా మూతపడిన దుకాణాలు



ప్రధానోపాధ్యాయునికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రుణమాఫీ చేయాలని ఆందోళన

నార్నూర్, ఆగస్టు 21 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నియమ నిబంధన షరతులు పెట్టకుండా ఏకంగా రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలని మండలలోని మలంగి గ్రామానికి చెందిన రైతులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు జగన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సాధారణ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తామని బహిరంగ చెప్పినందుకు రైతులు వారి నమ్మిఓటేసినారు. ఈ రోజు అధికారంలో ఉన్నందున కొత్త నియమ నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బంది చేయడం ఎంత వరకు నిజమని అభిప్రాయపడ్డారు. ఏకంగా 2లక్షల వరకు రుణాలు మాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఏఈఓ నిఖిల్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు, రైతులు, యువకులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి : బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, ఆగస్టు 21 : రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం చేపట్టనున్న రైతు ధర్నాను విజయవంతం చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో నియోజకవర్గ నాయకుల సమావేశంలో కలిసి మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో తాజా మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్‌సజన్, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, నియోజక వర్గ ముఖ్య నాయకులు కార్యకర్తలున్నారు.

జిల్లాలో రైతు ధర్నాలను విజయవంతం చేయాలి

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి) : మోస పూరిత హామీలను ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ప్రమాణం చేస్తూ అన్నదాతలను మరోసారి మోసం చేస్తున్నాడని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి జోగురామన్న ఆరోపించారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఆంక్షలు లేకుండా అర్హులైన రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే రైతు ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రహ్లాద్, రోకండ్ల రమేష్, జైనథ్ మాజీ ఎంపీపీ గోవర్దన్, ఇజ్జగిరి నారాయణ పలువురు నేతలు పాల్గొన్నారు.

రైతులపై అక్రమ కేసులు తగదు...

తలమడుగు : రుణమాఫీ చేయాలని నిలదీసిన రైతులపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేయడం సమంజసం కాదని మాజీ మంత్రి టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు పదవుల కోసం సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న కోరారు.

'షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి'

నేరడిగొండ, ఆగస్టు 21 : అర్హులైన రైతులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని తాజామాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శివారెడ్డిలు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు వద్ద రైతులతో కలిసి నిరసన తెలపారు. రైతులకు రుణమాఫీ చేయని సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

శాంతిభద్రతల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల



ఎస్సైని వివరాలు అడుగుతున్న ఎస్పీ

కుభీర్, ఆగస్టు 21 : శాంతి భద్రతలకు విగాతం కలగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జగరకుండా మండలంలోని గ్రామాల్లో ప్రతీరోజు పెట్రోలింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల గురించి అడిగి తెలుసుకొని ఇక్కడి ఎస్సై రవీందర్ పని తీరును ప్రశంసించారు. అంతకుముందు స్టేషన్ ఆవరణలోమొక్కలను నాటారు. ఆమె వెంట భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, రూరల్ సీఐ నైలు, ఎస్సై రవీందర్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

టీజీ ఎన్‌పీడీసీఎల్ ఖానాపూర్ ఏఈగా రామ్‌సింగ్

ఖానాపూర్, ఆగస్టు 21 : టీజీ ఎన్‌పీడీసీఎల్ ఖానాపూర్ ఏఈగా రామ్‌సింగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొద్ది నెలలుగా ఖానాపూర్ ఏఈగా రెగ్యులర్ అధికారి లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్లు, తిరుపతి, వెంకటేష్‌లు ఏఈగా తలో కొన్ని రోజులు అదనపు బాధ్యతలు నిర్వహించారు. తాజాగా నిజామాబాద్ నుండి రామ్‌సింగ్ బదిలీపై రావడంతో ఖానాపూర్ విద్యుత్‌శాఖకు రెగ్యులర్ అధికారి వచ్చినట్లు అయ్యింది. ఏఈగా బాధ్యతలు స్వీకరించిన రామ్‌సింగ్‌ను స్థానిక కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్‌తో పాటు పలువురు లైన్‌మెన్‌లు, జూనియర్ లైన్‌మెన్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

ముథోల్, ఆగస్టు 21 : మండల కేంద్రమైన ముథోల్‌లోని బీసీ సంఘ భవనంలో గల వ్యాక్సినేషన్ కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిస్ గోరి బుధవారం తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు. వ్యాక్సినేషన్ కొరకు వచ్చిన పిల్లల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. పిల్లల తల్లులకు తప్పనిసరిగా ఆరోగ్య నియమాలు చెప్పాలన్నారు. ఈయన వెంట వైద్యాధికారిని నేహా సాదఫ్, ఏఎన్ఎం విజయ, ఆశా కార్యకర్తలు సుజాత, తదితరులు ఉన్నారు.

మూడవ విడత సామాజిక తనిఖీ

నర్సాపూర్(జి), ఆగష్టు 20 : మండల కేంద్రంలోని యంపీడీవో కార్యాలయంలో ఆవరణలో బుధవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ మూడవ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక డీఆర్‌డీవో ఆధ్వర్యంలో తనిఖీ బృందం క్షేత్ర సందర్శనలు అనంతరం సామాజిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా జాబ్‌కార్డులు అప్డేట్ చేయకపోవడం, పనులు జరుగకుండానే బిల్లులు కాజేయడంతో పంచాయతీ కార్యదర్శిలకు, యంపీడీవో, ఏపీవో, టీ.ఏ, సీ.వోల వద్ద నుండి 91637 తొంభై ఒక్కవేయిల ఆరు వందల ముప్పై ఏడు వేల రూపాయల నగదు రికవరీకి ఆదేశించారు. రాంపూర్ గ్రామంలో ట్రెంచ్ పనుల్లో 325 మూడు వందల ఇరవై ఐదు మీటర్లు, తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో 171 మీటర్లు తేడాలను గుర్తించారు. క్యాటిల్ షెడ్ నిర్మించి పూజ గదిగా ఉపయోగించడం, డొంగుర్‌గాం గ్రామంలో కూలీల వద్ద నుండి పనులు చేయకున్నా వంద రూపాయలు వసూలు చేసి పనులు చేసినట్లు మస్టర్‌రోల్స్‌లో చేర్చడంతో యంపీడీవో స్థాయి అధికారి విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఆదేశించారు.

నిర్మల్ జిల్లాలో బంద్ ప్రశాంతం

● ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ నినాదాలు
● తెరుచుకోని వ్యాపార,వాణిజ్య,విద్యా సంస్థలు
● ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ, నిరసన ప్రదర్శనలు
● ఆర్‌డీవో కార్యాలయంలో వినతిపత్రం అందచేత



భైంసాలోని ప్రధాన మార్గల్లో కొనసాగిన ర్యాలీ



లక్ష్మణచాందలో బంద్

భైంసా, ఆగస్టు 21 : కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన ఎస్సీ,ఎస్టీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి బుధవారం చేపట్టిన భారత్‌బంద్ నిర్మల్ జిల్లాలో విజయవంతం అయ్యింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో వ్యాపార, వాణిజ్య సంస్థలు తెరుచుకోలేదు. విద్యా సంస్థలు పనిచేయలేదు. బస్సులు యదావిధిగా నడిచినప్పటికి బంద్ ప్రభావంతో ప్రయాణీకుల రాకపోకలు అంతంత మాత్రంగానే కొనసాగాయి. దీంతో నిత్యం ప్రయాణీకుల రాకపోకలతో సందడిగా కనిపించే భైంసా బస్టాండ్ బోసిపోయి కనిపించింది. వ్యాపార,వాణిజ్య సంస్థలు తెరుచుకోకపోవడంతో ప్రధాన రోడ్డు మార్గాలు క్రయ,విక్రయదారులు లేక వెలవెలబోయాయి. బంద్‌లో భాగంగా ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పట్టణ పరిధిలోని ప్రధాన రోడ్డు మార్గాల్లో ముందుగా బైక్ ర్యాలీ తదనంతరం పాదయాత్రతో భారీ ర్యాలీలు చేపట్టాయి. ఇందులో డివిజన్ పరిధిలోని ఏడు మండలాల నుంచి శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చాయి. ర్యాలీ అనంతరం ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సంబంధిత విషయంలో ఆర్‌డీవో కార్యాలయంలో వినతి పత్రం అందచేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి భైంసా డివిజన్ అధ్యక్షులు భీంరావ్ డొంగ్రే, ప్రధాన కార్యదర్శి విఠల్ కామ్లే, ఉపాధ్యక్షులు గౌర శ్రీనివాస్, కోశాధికారి ధర్మాజీ చందనేలు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీల వర్గీకరణ దేశ సమగ్రతకు,ఐఖ్యతకు భంగం కలిగించే విధంగా ఉందన్నారు. కులాలను విడదీసే చర్యలు సమాజానికి ఎంతమాత్రం శ్రేయస్కరం కాదన్నారు. దళితుల మధ్య విభేదాలు సృష్టించి రాజ్యాంగాన్ని అగౌరవ పరచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సుప్రీం కోర్టు రాష్ట్రాలకు ఇచ్చిన ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ అధికారాలపై రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సంబంధిత విషయంలో వెంటనే ఆర్డినెన్స్ తీసుకోచ్చి వర్గీకరణ అంశాన్ని ఆపాలన్నారు. లేని పక్షంలో ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు.

లక్ష్మణచాంద : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మండలంలో బుధవారం చేపట్టిన భారత్ బంద్ సంపూర్ణంగా ప్రశాంతంగా ముగిసింది. వర్గీకరణను రాష్ట్రాలు చేసుకోవచ్చు అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ బంద్‌ను నిర్వహించారు. 2004లో వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు లేదని తీర్పు ఇచ్చి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వర్గీకరణ ఆర్డినెన్స్‌ను రద్దు చేసిన ఇదే ధర్మాసనం 2024లో రాష్ట్రాల వర్గీకరణ చేసుకోవచ్చు అని ఇచ్చిన ద్వంద వైఖరిని నిరసిస్తూ ఈ బంద్ కొనసాగింది. మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌ను పాటించాయి. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ కన్వీనర్ మెట్టు ప్రసాద్, నాయకులు జడ్డి శ్రీనివాస్, మెట్టు శేఖర్, గుజ్జారి ఈశ్వర్, సుంకరి శ్రీనివాస్, ముత్యం, అయిండ్ల గంగన్న, అశోక్, తదితరులు ఉన్నారు.

కుంటాల : కుంటాల మండలంలో బుధవారం బంద్ ప్రశాంతంగా కొనసాగింది. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఇచ్చిన బంద్ పిలుపు మేరకు కుంటాల మండలంలోని లింబా (కే) గ్రామంలో మాల యువజన సంఘం ఆధ్వర్యంలో పాఠశాలలు, దుకాణాలను మూసి వేయించారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.

ఖానాపూర్ : ఎస్సీ వర్గీకరణ తీర్పును సుప్రీం కోర్టు పునః పరిశీలించాలని మాల మహానాడు డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో మాల మహానాడు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అంతకుముందు కేంద్ర ప్రభుత్వ దళిత వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని ఆరోపిస్తూ స్థానిక అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా ఎస్సీలు సామాజికంగా ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కొరకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఎస్సీల్లో వర్గీకరణ పేరుతో విభజించు - పాలించు అనే ధోరణిని తెరపైకి తెస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి నిజంగానే ఎస్సీలపై ప్రేమ ఉంటే జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు రిజర్వేషన్‌లను పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. దళితులు మనువాద పార్టీల మాయలో పడవద్దని కోరారు. దళితులంతా రాజ్యాంగం కోసం కలిసి పోరాటం చేయాలని పిలుపునిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి రాజన్న, ఉపాధ్యక్షులు బేరా తిరుమలేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదుల ప్రతాప్, నియోజకవర్గ అధ్యక్షులు మేష సతీష్, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాసమల్ల అశోక్, ద్యావతి రాజేశ్వర్, మ్యాదరి రాజేశ్వర్, దాసరి రాజేశ్వర్, పందుగ పెద్దలు, దాసరి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

తానూర్ : భారతీయ బౌద్ధమహాసభ, భీమ్ ఆర్మీ, ఎస్సీవర్గీకరణ కమిటీతో పాటు అన్ని దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బంద్ తానూర్‌లో ప్రశాంతంగా జరిగింది. పలువురు వ్యాపారులు బంద్‌లో పాల్గొని తమ దుకాణాల సముదాయలను మూసి వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో బౌద్ధ మహాసభ తెలంగాణ స్టేట్ సెక్రటరీ సూర్యకాంత్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ బద్ధం కాదని, సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పుఇవ్వడం పై నిరసన వ్యక్తం చేస్తూ బంద్ నిర్వహించడం జరిగిందన్నారు. ఎస్సీలను వర్గీకరించి దళితులను విడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, ఎస్సీ వర్గీకరణను మేము ఒప్పుకోమని స్పష్టం చేశారు. ఎస్సీవర్గీకరణపై నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరసనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ కమిటీ తాలుక సెక్రటరీ పవార్ భీంరావు, జిల్లా సెక్రటరీ పవార్ సాయినాథ్, నాయకులు అంబాదాస్, భగ్వాన్, మహేష్, రమేష్, సునీల్, నాగరావు, బాద్రే సంజయ్, సంజయ్, ఉపాసకులు, ఉపాసికలు, పాల్గొన్నారు.



తానూర్‌లో మూసి ఉన్న దుకాణాలు

బాసరను సందర్శించిన

కేంద్ర ఆర్కియాలజీ బృందం

బాసర, ఆగస్టు, 21 : బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రాన్ని కేంద్ర ఆర్కియాలజీ ప్రొఫెసర్ మహాలక్ష్మీ రామకృష్ణన్ బృందం సందర్శించింది. మొదట బృంద సభ్యులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆచారాలు, సంప్రదాయాలు, అక్షర శ్రీకార పూజల గురించి వారు ఆరా తీశారు. ఆలయ చరిత్ర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాస మహర్షి తపస్సు చేసిన గృహ ప్రదేశాన్ని, ఆలయంలో తిరిగి ఇతర ప్రదేశాలను సందర్శించారు. అంతకముందు ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ పండితులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ముథోల్, ఆగస్టు 21 : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల యందు 2024-25 సంవత్సరంకు గాను గెస్ట్ ఫ్యాకల్టీ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్లు జీవ శాస్త్రము-1, గణితం-1, పీజీటీ టీచర్స్ తెలుగు-1, గణితం-2, టీజీటీ టీచర్స్ గణితం-1, ఫిజికల్ సైన్-1 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఆగస్టు 23న ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ కొరకు ముథోల్‌లోని గురుకుల పాఠశాలలో హాజరు కాగలరని కోరారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 9848451133కు సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ముథోల్, ఆగస్టు 21 : ముథోల్ మండలంలోని విట్టోలి తండా నుండి ఆష్ట వెళ్లే రోడ్డుపై గుంతలు ఉండటంతో వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ వెంటనే రోడ్డు భవనాల శాఖ అధికారులతో మాట్లాడారు. రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో బుధవారం రోజు ఈ రోడ్డుకు రోడ్డు భవనాల శాఖ అధికారులు మరమ్మతుల పనులు చేపట్టారు. ఎమ్మెల్యే చొరవతో రోడ్డు బాగు చేస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీరి వెంట యువ నాయకుడు సతీష్‌రెడ్డి ఉన్నారు.

'ఆలయాభివృద్ధికి కృషి చేస్తా'

కుంటాల, ఆగస్టు, 21 : కుంటాల మండల ప్రజల ఇలవెల్పు గజ్జలమ్మ ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తామని మాజీ జడ్పీ చైర్మన్ జుట్టు అశోక్, మాజీ ఎంపీటీసీ పోశెట్టి, నాయకులు దొనికెన వెంకటేష్ అన్నారు. బుధవారం ఆలయ కమిటీ ఆవరణలో ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన వారు ఆలయం ఆవరణలో రీడింగ్ రూమ్ నిర్మాణం కోసం ఎస్‌డీఎఫ్ నిదుల నుండి 5 లక్షలు మంజూరు చేయడమే గాకుండా. మెయిన్ రోడ్డు, హైస్కూల్ నుండి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మించేందుకు 25 లక్షల నిదులు కేటాయించడం జరిగిందన్నారు.





- కాంగ్రెస్‌లో పోటాపోటీగా పైరవీలు
- నియోజకవర్గాల్లో ఇన్‌చార్జీలు చెప్పిందే ఫైనల్
- బోథ్ నియోజక వర్గంలో గందరగోళ పరిస్థితులు
- స్థానిక సంస్థల పదవులపై ఆశావహ నేతల గురి
- పార్టీ అధిష్ఠానం మద్దతు కోసం ప్రయత్నాలు

'నామినేటెడ్'పై కాంగ్రెస్‌ నేతల నజర్

ఆదిలాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలం తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు నామినేటెడ్ పదవులపై దృష్టి సారిస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో ఇక నామినెట్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచిపోతున్నా జిల్లాకు చెందిన నేతలెవరికీ రాష్ట్ర స్థాయిలో పదవులు దక్కలేదు. దీంతో రాష్ట్ర, జిల్లా స్థాయి పదవులను దక్కించుకునేందుకు పలువురు నేతలు ప్రయత్నం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు విజయ డెయిరీ ఛైర్మన్ పదవితో పాటు కమిషన్ పదవులు దక్కాయి. ఆ తర్వాత కేటాయించిన రాష్ట్ర స్థాయి నామినెట్ పదవుల్లో జిల్లాకు అవకాశమే లేకుండా పోయింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు జిల్లాలో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో కొంత అసంతృప్తి ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే గతంలో కంటే మెరుగైన ఫలితాలే వచ్చాయంటూ కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సెంటిమెంటుగా భావిస్తున్న జిల్లాకు నామినెట్ పదవుల విషయంలో మాత్రం ప్రాధాన్యం దక్కడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలో పాక్షికంగా, పూర్తి స్థాయిలో నాలుగు అసెంబ్లీ స్థానాలు ఉండగా ఖానాపూర్ నియోజక వర్గంలో మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. మిగితా మూడు నియోజక వర్గాల్లో బీజేపీ, బీఆర్ఎస్‌ల అభ్యర్థులు గెలుపొందడం కాంగ్రెస్‌కు కొంత ఇబ్బందికరంగా మారిందంటున్నారు. ఇప్పటికే ఖాళీ అయిన జిల్లా పార్టీ అధ్యక్ష పదవితో పాటు (డీసీసీ), మార్కెట్ కమిటీ, గ్రంథాలయ ఛైర్మన్, ఇతర పదవుల కోసం కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అధిష్ఠానం మద్దతు కోసం నేతలు తరచూ హైదరాబాద్‌కు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం, పార్టీలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు పసిగడుతూ అప్రమత్తమవుతున్నారు.

నియోజక వర్గాల్లో ఇన్‌చార్జీలే కీలకం..

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందని నియోజక వర్గాలలో ఓటమి పాలైన అభ్యర్థులనే ఇన్‌చార్జీలుగా నియమించారు. వీరి మద్దతు, సమ్మతితోనే ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతో పాటు నామినెట్ పదవుల కేటాయింపులకు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన ఇన్‌చార్జీలకు ప్రత్యేకంగా ప్రభుత్వం నిధులను కూడా కేటాయించింది. నియోజక వర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పలు పథకాల అమలులో ఇన్‌చార్జీలను భాగస్వామ్యం చేస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇకపై నామినెట్ పదవుల కేటాయింపుల్లోను నియోజక వర్గ ఇన్‌చార్జిల నిర్ణయమే కీలకమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మార్కెట్ పదవులతో పాటు ఆలయ ఛైర్మన్, గ్రంథాలయ ఛైర్మన్, ఇతర పదవులు ఇన్‌చార్జిలు చెప్పిన వారికే ఫైనల్ చేసే అవకాశం కనిపిస్తోంది. నేతలు తమకున్న పరిచయాలతో అధిష్ఠానం వద్ద పైరవీలు చేసుకుంటున్నా.. నియోజక వర్గ ఇన్‌చార్జిల ఆమోదం తప్పని సరి అంటూ చెప్పడంతో ఆశావహ నేతలు అయోమయానికి గురవుతున్నారు. పార్టీలో సీనియర్ నేతలుగా కొనసాగుతున్న ఇన్‌చార్జీలకే అధిష్ఠానం ప్రాధాన్యం ఇవ్వడంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బోథ్‌లో ఆధిపత్యపోరు..

ఆదిలాబాద్, ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజక వర్గాల్లో పార్టీ పరిస్థితి ప్రశాంతంగానే కనిపిస్తున్నా బోథ్ నియోజక వర్గంలో మాత్రం గందరగోళ పరిస్థితులకు దారి తీస్తోంది. ఇటీవల బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో డిప్యూటీ సీఎం పర్యటించిన సందర్భంలో నేతల మధ్య ఆధిపత్య పోరు కనిపించింది. సభా వేదికపైకి డాక్టర్ వన్నెల అశోక్ వెళ్లగా కొద్ది సేపటికే అధికారులు ఆయనను కిందికి పంపించేయడం చర్చనీయాంశంగా మారింది. ఓ వర్గం నేతలు ఫిర్యాదు చేయడంతోనే పోలీసులు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అధికారిక కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొనరాదంటూ అధికారులు సూచించారు. కానీ నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన పలువురు నేతలు సభావేదిక పైనే ఉండడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అలాగే ఇటీవల ప్రభుత్వానికి ఇచ్చిన నామినెట్ పదవుల జాబితాలో డాక్టర్ వన్నెల అశోక్ పేరు ఉండడంతో మరో వర్గం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయమై అధిష్ఠానం పెద్దలకు ఫిర్యాదు కూడా చేసిన్నట్లు సమాచారం. బోథ్ కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాల మధ్య నువ్వా.. నేనా? అన్నట్లుగా పరిస్థితులు మారడంతో పార్టీ పెద్దలకు తలనొప్పిగా మారిందంటున్నారు.

జిల్లా పదవులపై నేతల కన్ను..

జిల్లా పార్టీ అధ్యక్ష పదవితో పాటు మున్సిపల్ ఛైర్మన్, జడ్పీ ఛైర్మన్, డీసీసీబీ ఛైర్మన్ పదవులను దక్కించుకునేందుకు పలువురు నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. డీసీసీ పదవిపై ఆదిలాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డితో పాటు బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డిలు కన్నేసినట్లు పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. అలాగే త్వరలో జరిగే జడ్పీటీసీ ఎన్నికల్లోను గెలుపొంది జడ్పీఛైర్మన్ పదవి కోసం బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పార్టీ పెద్దలు ఆయనకు ఖచ్చితమైన హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సారి ఎలాగైనా మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి ఛైర్మన్ పదవిని దక్కించుకునేందుకు కంది శ్రీనివాస్‌రెడ్డి పక్కాప్లాన్‌తో ఉన్నట్లు తెలిసింది. అనుకున్న విధంగానే సరిపడా మెజార్టీ వస్తే ఆయన సతీమణి కందిమౌనారెడ్డిని మున్సిపల్ ఛైర్మన్ చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. త్వరలో జరగబోయే మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పట్టుబిగిస్తోంది. ఇప్పటికే ముఖ్య కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేస్తూ నియోజక వర్గ ఇన్‌చార్జిలు శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

జడ్పీ సీఈవోగా జితేందర్‌రెడ్డి



జితేందర్‌రెడ్డికి పూలమొక్కను అందిస్తున్న బాలూరి

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 21 : ఆదిలాబాద్ జిల్లా పరిషత్ నూతన సీఈఓగా జితేందర్‌రెడ్డి బుధవారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఈఓకు కార్యాలయ అధికారులు సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జడ్పీ సీఈఓని బాలూరి గోవర్ధన్‌రెడ్డి పూలమొక్కను అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

● ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ, ఆగస్టు 21 : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. బుధవారం మండల ఎంపీడీవో సమావేశ మందిరంలో పంచాయతీ ఉపాధిహామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచేలా అవగాహన కల్పించడంతో పాటు దోమల నివారణ మందులను మురికి కాలువలో నీటి నిల్వ ప్రాంతాల్లో చల్లించాలన్నారు. వర్షాలు సంవృద్ధిగా కురుస్తున్నందున మొక్కలను విరివిగా నాటాలన్నారు. సమావేశంలో ఎంపీవో లక్ష్మణ్, ఏపీఓ వసంత్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఇంద్రవెల్లి, ఆగస్టు 21: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. విద్యార్థినిలు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ప్రియ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను

త్వరితగతిన పరిష్కరించండి

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 21 : భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి దాఖలైన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా పంచాయతీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులకు ఆదేశించారు. మొబైల్ యాప్ ద్వారా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ నిర్వహించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, ముందుగా అన్ని దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయాలని అధికారులకు సూచించారు. సర్వేనెంబర్లు, ప్లాట్ అప్లికేషన్ల సంఖ్యన రోడ్డు విస్తీర్ణం, ఇనాం భూమి తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారులను అనవసర ఇబ్బందులకు గురిచేయకూడదని, క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లడానికి ముందే దరఖాస్తుదారులకు సమాచారం అందిస్తే వారు ప్లాట్‌స్థలంలో అందుబాటులో ఉంటారన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన సందర్భంగా అది ప్రైవేట్ స్థలమేనా లేక ప్రభుత్వ స్థలమా అన్నది పక్కాగా నిర్ధారించుకోవాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు అస్కారం లేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, డీపీవో శ్రీలత, ఏఓ పంచాయతీ సెక్రటరీలు, ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

పరిష్కారానికి చర్యలు : మున్సిపల్ కమిషనర్

ఆదిలాబాద్ రూరల్ : ఎల్ఆర్ఎస్‌లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, పరిశీలన, సర్వే, యాప్‌లో నమోదు గురించి వివరించారు. 2020 ఆగస్టు కంటే ముందు పత్రాలు ఉండి ఎల్ఆర్ఎస్ కోసం ఎవరైతే దరఖాస్తు చేసుకున్నారో వాటిని పరిశీలించాలని ఆయన అన్నారు. సమావేశంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంతత

● సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీత వెంకట్



వివరిస్తున్న సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీత వెంకట్

తలమడుగు , ఆగస్టు 21 : ప్రతి ఒక్కరికి ధ్యానం ఎంతో అవసరమని సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీత వెంకట్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హైస్కూల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ధ్యాన చైతన్య సదస్సులో ఆమె మాట్లాడుతూ నిత్య జీవితంలో ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారు. మనిషికి మనశాంతి లేక ఎన్నో రోగాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి ధ్యానం ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావ్, పిరమిడ్ మాస్టర్ అనూష, సునీతారెడ్డి, తలమడుగు ధ్యాన కేంద్రం ఉపాధ్యక్షులు అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సెక్రెటరీపై వేటు తగదు



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

బజార్‌హత్నూర్, ఆగస్టు 21 : మండల పరిధిలో 30 గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు నార్నూర్ మండలంలోని ఓ పంచాయతీ సెక్రటరిని సస్పెండ్ చేసినందుకుగాను నిరసనగా నాలుగు రోజుల పాటు విధులకు హాజరుకాబోమని ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎఫ్ఎఫ్‌సీ నిధులు రాకపోవడంతో పంచాయతీల భారం అంతా తామే భరిస్తున్నామన్నారు. అది గుర్తించకుండా జిల్లాస్థాయి అధికారులు పంచాయతీ సెక్రటరీపై వేటువేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం నుంచి సకాలంలో పంచాయతీ కార్యాలయాలకు నిధులు విడుదల చేస్తే తాము సకాలంలో శానిటేషన్ పనులను నిర్వర్తించేందుకు అవకాశం ఉంటుందని వారు వాపోయారు. పంచాయతీ కార్యాలయాల్లో ప్రభుత్వం ఎటువంటి నిధులు మంజూరు చేయకపోవడంతో పై అధికారుల ఒత్తిడితో తాము సొంత డబ్బులను సైతం వెచ్చిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి : మేజిస్ట్రేట్

భోథ్, ఆగస్టు 21: సెప్టెంబర్ 9న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లను న్యాయవాదులు విజయవంతం చేసేందుకు కృషిచేయాలని జూనియర్ సివిల్ జడ్జి హంస్సేన్ కోరారు. బుధవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి సమావేశం నిర్వహించారు. అదాలత్‌ను విజయవంతం చేసేందుకు గాను ఎక్కువ కేసులను పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వామన్‌రావు,చ దేశ్‌పాండే, న్యాయవాదులు కె.సుభాష్, అంగతు కేంద్రీ ఠాకూర్, రూపేందర్‌సింగ్, కుమ్మరి విజయ్, దమ్మబాల్ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఆయా శాఖల అధికారులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న ఎంపీ)

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

● ఎంపీ గోడం నగేష్

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 21 : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను సక్రమంగా వినియోగించడంతో పాటు, పథకాలపై విస్తృత ప్రచారం కల్పించాలని ఎంపీ గోడంనగేష్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన దిశ మీటింగ్‌లో కలెక్టర్ రాజార్షిషా, ఎమ్మెల్యే పాయలశంకర్‌తో కలిసి పాల్గొన్నారు. శాఖల వారీగా కేంద్ర ప్రభుత్వం నిధులు, పనులు, యూసీల వివరాలను తెలుసుకున్నారు. పనులు, అభివృద్ధి పథకాలను ప్రజలకు సక్రమంగా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ నగేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి అనేక నిధులను ఇస్తుందన్నారు. కాని దాన్ని సక్రమంగా ఖర్చు చేయడం లేదన్నారు. జిల్లాలోని ఆయా శాఖలకు కేంద్రం నుంచి వచ్చిన ఖర్చు చేసి యూసీలు పంపని కారణంగా నిధులు రాలేదన్నారు. అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధులతో చేపట్టే పనులపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. జిల్లాకు రావాల్సిన నిధులను వంద శాతం తీసుకువస్తానని, అధికారులు కూడా సక్రమంగా వాటిని ఖర్చు చేసి యూసీలను పంపాలన్నారు. అప్పుడే మరిన్ని నిధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, డీఆర్డీఓ సాయన్న, డీఎస్ ఓ కిరణ్‌కుమార్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

● విద్యుత్ శాఖ డీఈ హరికృష్ణ



బిల్లులను తనిఖీ చేస్తున్న డీఈ

తలమడుగు , ఆగస్టు 21 : విద్యుత్ వినియోగదారులు సకాలంలో వారి విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఇక నుంచి మళ్ళీ ఆన్‌లైన్ గూగుల్ పే, ఫోన్ పే ద్వారా కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని విద్యుత్ శాఖ డీఈ హరికృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని సుంకిడి గ్రామంలో కమర్షియల్ సర్వీస్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వినియోగదారులు వారి విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలన్నారు. వర్షాకాలంలో వినియోగదారులు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. మండలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట మండల విద్యుత్ శాఖ అధికారి సతీష్‌కుమార్, లైన్‌మెన్ శంకర్, మహేందర్ తదితరులున్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు



ఆసుపత్రిలో వైద్యం కోసం చేరిన రోగులు

బోథ్, ఆగస్టు 21 : మండలంలో వైరల్, మలేరియా టైఫాయిడ్ జ్వరాల తీవ్రత అధికంగా ఉంది. ఫలితంగా వైద్యం కోసం రోగులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో ఆసుపత్రి రోగులతో నిండిపోతుంది ప్రతి రోజు ఓపీ పేషెంట్లుగా దాదాపు 300 వరకు వస్తున్నారు. దీంతో జ్వరాల తీవ్రత ఏ విధంగా ఉందనేది అర్థమవుతుంది. పట్టణంలో దోమల బెడద తీవ్రంగా ఉండడంతో ప్రజలు వైరల్, మలేరియా జ్వరాల భారిన పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంలో వారం రోజుల క్రితం వైద్య శిబిరం నిర్వహించినా వ్యాధుల ఉధృతి తగ్గలేదు. మరో వైపు రోగులకు సరిపడా బెడ్లు, మందులు లేకపోవడంతో ఇతర పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. జిల్లా అధికారులు వ్యాధుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

పంటలపై కమ్ముకుంటున్న పొగ

● పత్తి, సోయాబీన్ పంటకు నష్టమంటున్న రైతులు

బోథ్, ఆగస్టు 21: మండలంలో మూడురోజులుగా పంటలపై పొగ మంచు కమ్ముకుంటుంది. ఉదయం పూట పొగమంచు కురుస్తుండటంతో మబ్బులు కమ్ముకుంటున్నాయి. అయితే పొగమంచు కురుస్తుండటంతో పూత దశలో ఉన్న పత్తి, సోయాబీన్ పంటకు నష్టం సంభవించే ఆస్కారం ఉందని రైతులు వాపోతున్నారు. పంటలను పొగ మంచు నుంచి కాపాడుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తగు సూచనలు చేయాల్సిన అవసరం ఉంది.



పంట పొలాలపై కమ్ముకున్న పొగ మంచు